క్లుప్తంగా

తిక్కవరప్పాడులో గ్రామోత్సవం

వెంకటాచలం: తిక్కవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పనాయుడు స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మంచు శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి అయ్యప్పనాయుడు స్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి పూలాలంకరణ చేసి గ్రామంలోని అన్ని వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు, ధాన్యం(వడ్లు) ఇచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉత్సవాల్లో చివరి రోజున విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

దుగ్గుంట వద్ద బస్‌స్టాపింగ్

పొదలకూరు: మండలంలోని దుగ్గుంట రామాపురం వద్ద రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలుపుతామని రాపూరు డిపో మేనేజర్ ఉత్తర్వులు ఇచ్చినట్టు ఎంపీడీఓ నగేష్‌కుమారి వెల్లడించారు. జూన్ మాసంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో దుగ్గుంట రామాపురం వద్ద రాత్రి వేళల్లో అల్ట్రా, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఆపాల్సిందిగా దుగ్గుంట ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి కోరారు. తర్వాత స్టేజ్ టికెట్ తీసుకునైనా రామాపురం వద్ద బస్సులను నిలిపితే రాత్రివేళల్లో చివరి బస్సులను ప్రయాణికులు ఎక్కి దిగేందుకు వీలుగా ఉంటుందని సభ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆర్టీసీ డిపో మేనేజర్ ఉత్తర్వులు ఇచ్చినట్టు ఎంపీడీఓ పేర్కొన్నారు.

అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డు తొలగించండి

మనుబోలు: మనుబోలు వైఎస్సార్ సర్కిల్ వద్ద ట్రాఫిక్‌కు అడ్డుగా వున్న అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డును తొలగించాలని జనసేన నాయకులు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యను కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రోడ్డు మలుపులో బోర్డు పిల్లర్ రోడ్డుపైకి వచ్చి వుండడంతో పెద్ద వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని పిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రసాద్, పవన్, కోటేశ్వరరెడ్డి, జాకీర్ తదితరులున్నారు.

బలవంతపు చందాలొద్దు

ముత్తుకూరు: వినాయక చవితి పండుగ సాకు చూపి ఎవరైనా బలవంతపు చందాల వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని కృష్ణపట్నం సీఐ కే వెంకటరెడ్డి హెచ్చరించారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. బలవంతపు చందాలకు పాల్పడే వారి వివరాలు అందజేస్తే వారిపై తగు చర్యలు తీసుకొంటామని చెప్పారు.

వర్గీకరణపై తీర్పును వ్యతిరేకిస్తున్నాం


కోవూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర మాలమహానాడు వర్కింగ్ అధ్యక్షులు డాక్టర్ స్వర్ణ వెంకయ్య పిలుపు మేరకు కోవూరు బజారు కూడలిలో మాలమహానాడు ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బల్లి వెంకయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు సరికాదన్నారు. ఈ తీర్పు మోడీ మార్క్ తీర్పుగా అభివర్ణిస్తున్నామన్నారు. అన్నదమ్ములుగా ఉన్న మాల, మాదిగలను విడదీసి పాలించు రీతిలో పాలకులు చేస్తున్న కుట్ర ఇదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సోనగిరి జగన్, జిల్లా యువత అధ్యక్షుడు బల్లి శరత్ కుమార్, మహిళా నాయకులు పుట్ట పద్మమ్మ, నావూరు బుజ్జయ్య, కొందమూరి దాస్, ఎల్లు శ్రీనివాసులు, గాలి రాజా, తురకా గోపీనాథ్, స్వర్ణ తులసి తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడంతా స్థానికేతరులే

- పొదలున్నందునే పొదలకూరు పేరు
- పట్టణంలో మహిమ గల వినాయకుడు
- వివిధ కారణాలతో వీధులకు పేర్లు
- చుట్టుపక్కల గ్రామస్తుల నివాసం

పొదలకూరు జనాభా	- 17,662
పంచాయతీలో ఓటర్లు	- 15,077
నివాసాలు	- 4,430


పొదలకూరు పట్టణంలోని ఓ భాగం


పొదలకూరు వినాయకుడు

పొదలకూరు: పొదలకూరు స్థానికేతరులకు నెలవుగా మారింది. చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చి పొదలకూరులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారే అధిక సంఖ్యలో ఉన్నారు. దశాబ్దాల నుంచి స్థానికంగా ఉన్న వారి కుటుంబాలు చాలా తక్కువ. శతాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో పొదలు అధికంగా ఉండడంతో ఈ గ్రామానికి పొదలకూరుగా నామకరణం చేశారనే నానుడి ప్రచారంలో ఉంది. అయితే ఊరికి పేరెలా వచ్చిందో వృద్ధులు సైతం కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. మహిమ కలిగిన వినాయకుడు, శివాలయం ఉండడంతో చుట్టుపక్కల గ్రామాల్లో పొదలకూరుకు గుర్తింపు ఉంది. 200 సంవత్సరాల క్రితం ఊరు ప్రస్తుత మారుతీనగర్ ప్రాంతంలో ఉండేదని తెలుస్తోంది. అదే ప్రాంతంలో పెరుమాళ్ల స్వామి దేవస్థానం కూడా ఉండేది. అయితే అక్కడ వీరాంజనేయస్వామి ఉత్తర దిశ ముఖంతో ఉండడం వల్ల ఊరును ఖాళీ చేసి మరో దిక్కులో ఏర్పాటు చేసుకోవాలని అప్పట్లో పెద్దలు సూచించడంతో ఊరు రామమందిరం ప్రాంతంలో పెరిగినట్టుగా చెప్పుకుంటున్నారు. ఇప్పటికీ చాలామటుకు పట్టణంలోని ప్రధాన రహదారి, వీధులు గ్రామనత్తంలోనే ఉన్నాయి. పంచాయతీ బస్టాండ్ అప్పట్లో మందబయలు (గేదెలు తోలే ప్రదేశం)గా ఉండేది. మస్తాన్‌రెడ్డి నగర్ ప్రాంతంలో కుంట ఉండేది. అగచాట్లు పడి ఏర్పడిన వీధికి అగచాట్ల పురమని, బుడేసాహెబ్ వల్ల గుర్తింపు వచ్చిన వీధికి బుడేసాహెబ్ వీధని, మగ్గం నేసే తొగటివారు ఉన్న ప్రాంతాన్ని తొగటివీధని, చేనేత కార్మికులు ఉన్న ప్రాంతాన్ని దేవాంగవీధని, బంగారు దుకాణాలున్న వీధిని రాజావీధని పిలుస్తున్నారు. యాదవులు అధికంగా ఉన్న ప్రాంతానికి యాదవవీధిగా నామకరణం చేశారు. మెయిన్‌రోడ్డులో ఉన్న దుకాణాలు బావి, కుంట పోరంబోకులుగా చెలామణి అయ్యేవి.

స్థానికేతరుల స్థిర నివాసం

పొదలకూరు ఐదు శతాబ్దాల క్రితం కేవలం 40 కుటుంబాలతో ఉండేది. ఆ కుటుంబాలు రామమందిరం ప్రాంతంలో నివాసం ఉండేవారు. ప్రస్తుతం ఉన్న రామనగర్‌గేటు సెంటరు ఉండేది కాదని తెలుస్తోంది. 40 కుటుంబాల్లో కూడా సుమారు 20 కుటుంబాల వారు తాత, ముత్తాల కాలం నాడు బయటి ప్రాంతాల నుంచి పొదలకూరుకు వలస వచ్చిన వారు. ప్రస్తుతం 4,430 కుటుంబాలు, 17,662 జనాభా ఉన్న పొదలకూరులో తెలుగుగంగ ముంపువాసులు, కలువాయి, చేజర్ల, రాపూరు, సైదాపురం, మనుబోలు, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. పట్టణంలోని విఘ్నేశ్వరపురం కాలనీ (ఎమ్మార్వో కాలనీ) మిక్స్‌డ్ కాలనీగా గుర్తింపు పొంది 600 నివాసాలు ఉన్నాయి. అక్కడ ఏ ఒక్క కుటుంబం స్థానికులు కాకపోవడం విశేషం.


శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం

మున్సిపాలిటీకి చేరువులో..

పొదలకూరు పంచాయతీ మున్సిపాలిటీకి చేరువులో ఉంది. గతంలో పంచాయతీని మున్సిపాలిటీగా మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే జనాభా కొంత మేర తగ్గడం వల్ల అమలు కాలేదు. అయితే చుట్టుపక్కల గ్రామాలు, మైనర్ పంచాయతీలను కలుపుకుంటే మున్సిపాలిటీగా మారేందుకు అవకాశం ఉంది. ఇందుకు కనీసం 25 వేల మంది జనాభా ఉండాలనే నిబంధనలు ఉన్నందున ఈ పర్యాయం మున్సిపాలిటీగా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పంచాయతీ పరిధిలో పట్టణంతో పాటు లింగంపల్లి, చిట్టేపల్లి, తోకంచి పునరావాస కేంద్రం తదితర గ్రామాలు ఉన్నాయి.

చిన్న ఊరుగా ఉండేది



పొదలకూరు దశాబ్దకాలంలో అభివృద్ధి చెందింది. పాతికేళ్ల ముందు చిన్న ఊరుగా ఉండేది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణానికి రావడం, పిల్లల చదువుల కోసం అద్దె ఇళ్లలో నివాసాలు ఉండడం వల్ల పట్టణం పెరుగుతోంది. ఇటీవల భూముల విలువ కూడా పెరిగి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇందువల్ల పంచాయతీకి కూడా నిధులు వస్తున్నాయి.

– వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఉప సర్పంచ్, పొదలకూరు.

యజమానులు నిబంధనలు పాటించాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో కల్యాణ మండపాలు నిర్వహిస్తున్న యజమానులు నిబంధనలు పాటించాలని నగర పంచాయతీ కమిషనర్ వెంకటరమణ బాబు సూచించారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం కల్యాణ మండపాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెళ్లిళ్లు, ఫంక్షన్ల సమయాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారన్నారు. ప్లాస్టిక్ నివారణతోపాటు చెత్త సేకరణకు అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. పార్కింగ్‌కు ప్రత్యేకంగా మండపంలోనే స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. రోడ్డు పక్కన ఉన్న కల్యాణ మండపాల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రతిఒక్కరూ ప్రత్యేకంగా పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవాలు ప్రారంభం

మనుబోలు: మనుబోలు–చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనా మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వెంకయ్యస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంధళ్ల శ్రీనివాసులు వెంకయ్యస్వామికి తొలుత స్వస్తిపుణ్యాహవచనం, సహస్రనామార్చన, పంచామృతాభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వెంకయ్యస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం నవగ్రహ శాంతి పూజ, కలశ ప్రతిష్టాపన, మహాగణపతి హోమం, శుక్రవారం అభిషేకాలు, శిఖరపూజ, పల్లకి సేవ, నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

ఆటల ద్వారా ఏకాగ్రత పెంపునకు కృషి


విద్యార్థులతో ఆటలాడిస్తున్న హిందీ పండిట్

కొడవలూరు: వివిధ రకాల ఆటల ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపునకు పాఠశాల హిందీ పండిట్ జి.నాగభూషణం కృషి చేస్తున్నారని గండవరం హైస్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు కొనియాడారు. గండవరం హైస్కూల్‌లో 'క్రమంలో అమర్చు – బహుమతి పట్టు' పేరుతో విద్యార్థులతో బుధవారం వినూత్న ఆట ఆడించారు. ఈ ఆటలో విజేతలైన విద్యార్థులకు హెచ్‌ఎం చేతుల మీదుగా బహుమతులందజేసి మాట్లాడారు. హిందీ పండిట్ పాఠశాలలో నిర్వహించిన ఆటల వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, మానసికోల్లాసం పెంపొందుతాయన్నారు. మూడు రకాల వస్తువులను రెండేసి వంతున తీసుకొని వాటిలో ఒక్కో వస్తువును కన్పించకుండా ర్యాక్‌లో పెట్టి మార్చుతూ ఉంటారని, ఆ చేతుల కదలిక ఆధారంగా పైన వస్తువులను అదే వరుసలో విద్యార్థులు మార్చాల్సి ఉంటుందన్నారు. ఈ ఆటకు ఎంతో ఏకాగ్రత అవసరమన్నారు. ఆటలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు హిందీ పండిట్ సొంత నిధులతోనే బహుమతులివ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాసం ముఖ్యం

వెంకటాచలం: విద్యార్థులు చదువుతోపాటుగా, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు సూచించారు. మండలంలోని కాకుటూరు వద్ద వీఎస్‌యూలో బుధవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతస్థాయిలో వెళ్లేందుకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ ఈ రెండు అంశాలు చాలా ఉపయోగపడుతాయని తెలియజేశారు. ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచే చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కళాశాలల్లో తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే విద్యార్థులకు చాలా ఉపయోగపడతాయన్నారు. అనంతరం సైకాలజిస్ట్ డాక్టర్ వి.సురేష్‌బాబు వ్యక్తిత్వ వికాసం గురించి కొన్ని మెలకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చినశేష వాహనంపై ఊరేగిన వెంకయ్యస్వామి


చినశేషవాహనంపై ఊరేగుతున్న వెంకయ్యస్వామి

వెంకటాచలం: గొలగమూడిలోని భగవాన్ శ్రీవెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం చినశేష వాహనసేవ నిర్వహించారు. ఉదయం వెంకయ్యస్వామికి నిత్య పూజ అనంతరం చినశేష వాహనంపై ఆశీనులను చేసి ఆకర్షణీయంగా పూలాలంకరణ చేశారు. వెంకయ్య స్వాముల వారిని ఆశ్రమం చుట్టూ ఊరేగించి ట్రాక్టర్‌పై ఉంచారు. అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే వెంకయ్యస్వామి ఆశ్రమ భజన బృందం కోలాట ప్రదర్శన చేసి ఓం నారాయణ.. ఆది నారాయణ అంటూ వెంకయ్యస్వామి గీతాలను ఆలపించారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు గొలగమూడికి చేరుకున్నారు. చినశేష వాహనసేవకు సిహెచ్ శ్రీధర్ (నెల్లూరు), వై.నరసింహారావు (సోత్‌రాజుపాళెం), ఎస్.సుబ్బరాజు (కుల్లూరు రాజుపాళెం), దిలీప్‌కుమార్‌రెడ్డి (నెల్లూరు) ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వేడుకగా గజ వాహనసేవ

ఆరాధనోత్సవాల్లో బుధవారం రాత్రి గజ వాహన సేవ నిర్వహించారు. గజ వాహనంపై స్వామివారిని ఆశీనులను చేసి పూలు, విద్యుద్దీపాలంకరణ ఆకర్షణీయంగా చేశారు. ఈ గ్రామోత్సవం గొలగమూడిలోని అన్నీ వీధుల మీదుగా సాగింది. గ్రామోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొని వెంకయ్యస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆమంచర్లకు చెందిన డి.వి నాయుడు, అరుణమ్మ దంపతులు గజ వాహనసేవకు ఉభయకర్తగా వ్యవహరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు

ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అశ్వవాహనసేవ, రాత్రి పెదశేషవాహనసేవ నిర్వహించనున్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

కోవూరు: కోవూరు సీఐగా వీ సుధాకర్‌రెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం విజిలెన్స్‌లో పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ శ్రీనివాసరావు మాచెర్లకు బదిలీపై వెళ్లారు.

బుచ్చి అర్బన్ సీఐగా..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ సీఐగా పి.శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ముత్తుకూరు: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా ముత్తుకూరులో బుధవారం ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కృష్ణకుమార్, బీజేపీ నేత సంపత్‌కుమార్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఉమామహేశ్వరావు, సత్యనారాయణ, వెంకటస్వామి తదితరులు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఎవరైనా తప్పు చేస్తే వెంటనే శిక్షించే విధంగా చట్టాలు మార్చాలని డిమాండు చేశారు.

కట్టుబడిపాళెంలో ఇరువర్గాల ఘర్షణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని కట్టుబడిపాళెంలో బుధవారం వినాయక చవితి చందా వసూలు విషయం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. గ్రామంలో రోడ్డుపై తాడుకట్టి వాహనదారుల నుంచి కొందరు యువకులు రెండు గ్రూపులుగా చందాలు వసూలు చేసే క్రమంలో రెండు వర్గాల మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీలను గణనీయంగా పెంచాలి

కొడవలూరు: ఉపాధి కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఎంపీడీఓ పి.సుబ్రమణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీలలో విధిగా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ప్రతి కూలీకి విధిగా గరిష్ఠ వేతనం అందేలా చూడాలన్నారు. పక్కా గృహ నిర్మాణాలు చేసుకొనే వారికి 90 రోజుల ఉపాధి హామీ పని దినాలు తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఏ గ్రామంలో ఉపాధి పనులు చేపట్టక పోయినా సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీఓ రాజశేఖర్, ఈసీ సూఫియా, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వందల్లో పెళ్లిళ్లు... పదుల్లో నమోదులు

కొడవలూరుకి చెందిన రమణకు 59 ఏళ్లు. ఉద్యోగ రీత్యా కొడుకు విదేశాల్లో స్థిరపడ్డాడు. కొడుకును చూసేందుకు రమణ ఆయన భార్య విదేశాలకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోగా... మీరిరువురు భార్యాభర్తలంటూ అధికారిక ధ్రువీకరణ పత్రం సమర్పించాలని అధికారులు సూచించారు. దీంతో చేసేదేమీ లేక 59 ఏళ్ల వయస్సులో రమణ ఆయన భార్య కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి వచ్చింది.


కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- వివాహ రిజిస్ట్రేషన్‌పై నిర్లిప్తత
- ధ్రువీకరణ పత్రం ఉంటే ఎంతో మేలు
- విదేశీ ప్రయాణాలకు అవసరం

కోవూరు: వివాహం చేసుకున్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన ఆవశ్యకత రోజు రోజుకు పెరుగుతోంది. ప్రస్తుత ప్రపంచంలో మనిషికి జనన, మరణ ధ్రువీకరణతో పాటు వైవాహిక ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మారుతోంది. వైవాహిక జీవితంలోకి అడుగిడే యువత పెళ్లి తంతును బంధుమిత్రుల సమక్షంలో సంబరంగా జరుపుకుంటున్నారు. ఈ జ్ఞాపకాలను ఫొటోలు, వీడియోల రూపంలో భద్రపరుచుకుంటున్నారు. ఇదే సందర్భంలో ప్రాధాన్యమున్న వివాహ ధ్రువీకరణ పత్రాలు పొందే విషయంలో చాలా మంది నిర్లిప్తంగా ఉంటున్నారు. పెళ్లి జరిగిన తరువాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, సచివాలయాల్లో నమోదు చేయించుకుంటే భవిష్యత్తులో అనేక ప్రయోజనాలు ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వివాహల నమోదు ఆశించిన విధంగా సాగటం లేదు. ఏటా కోవూరు నియోజకవర్గం వ్యాప్తంగా 200 నుంచి 400 వరకు పెళ్లిళ్లు జరుగుతున్నాయని పురోహితులు పేర్కొంటున్నారు. ఇందులో పదుల సంఖ్యలోనే జంటల నమోదు ఉంటోంది. పట్టణ ప్రాంతాల్లో ఈ నమోదు ఒక మోస్తరుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఈ తంతు మొక్కుబడిగానే సాగుతున్నాయి. గతంలో పెళ్లి చేసుకున్న దంపతులు రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే వివరాలు నమోదు చేయించుకోవాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వం సచివాలయాల్లోనూ ఈ అవకాశం కల్పించింది. పెళ్లి చేసుకున్న నవ దంపతులు మూడు నెలల్లోపు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. నెలలోపు అయితే ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదు. నెల దాటితే రూ.100 చలానా కట్టాలి. మూడు నెలలు దాటితే సమీప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతున్నా విదేశాలకు వెళ్లేవారు, లీగల్ అవసరాలున్న వారు మాత్రమే నమోదు చేయించుకుంటున్నారు. ప్రతి జంట వివాహ బంధాన్ని చట్టపరంగా నమోదు చేయించుకోవాలి. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చిందని, స్లాట్ బుక్ చేసుకుంటే నిర్ణీత తేదీ, సమయంలో వచ్చి వివాహ ధ్రువపత్రాలు పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

విదేశాలకు వెళ్లే దంపతులకు పాస్ పోర్టు, వీసా, వర్క్ పర్మిట్, బీమా తదితర విషయాల్లో పెళ్లి ధ్రువపత్రం ఉపయోగపడుతుంది. ఈ పత్రం ఉంటే ఉద్యోగులు భార్య లేదా భర్తను నామినీగా నమోదు చేయించుకోవడానికి వీలవుతుంది. భవిష్యత్తులో భార్యాభర్తల మధ్య ఇబ్బందులు ఎదురైతే కేసులు, కోర్టులో సాక్ష్యాల విషయంలో పెళ్లి ధ్రువీకరణ పత్రం ఉపయోగపడుతుంది. వివరాలతో నింపిన దరఖాస్తుతో పాటు దంపతులిద్దరి ఆధార్ నకళ్లు, జనన ధ్రువీకరణ పత్రాలు, పదో తరగతి మార్కుల జాబితా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, శుభలేఖ, తాళి కడుతున్న చిత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

వివాహ ధ్రువీకరణ కోసం ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సంబంధిత మునిసిపల్ కార్యాలయంలో గాని, గ్రామ పంచాయతీలో గాని నమోదు చేసుకోవచ్చు. నూతన వధూవరులు తప్పనిసరిగా పెళ్లి వివరాలను నమోదు చేయించుకోవాలి. ఆపై ధ్రువీకరణ పత్రం కోసం స్థానిక పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందిస్తారు. ఈ ప్రక్రియపై అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలియజేశాం.

– వెంకట రమణబాబు, కమిషనర్, బుచ్చిరెడ్డిపాళెం